
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 20 మే 2024

సిట్ విచారణ వేగవంతం

- హింసాత్మక ఘటనలు, కేసుల సమాచారం సేకరణ
- సంబంధిత వ్యక్తుల నుంచీ వివరాల నమోదు

తిరుపతి(నేరవిభాగం)/చంద్రగిరి, మే 19 : పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక సంఘటనలపై ఎన్నికల కమిషన్ నియమించిన సిట్ బృందం జిల్లాలో ఆదివారం పర్యటించి విచారణ చేపట్టింది.అదే రోజు రాత్రికే ప్రాథమిక నివేదికను సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఐజీ వినుత్ బ్రిజ్‌లాల్‌కు సమర్పించింది. ఆయా ఘటనలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లలో పలు లోపాలను గుర్తించి, దానికి బాధ్యులైన కొందరు అధికారులపై చర్యలకు కూడా సిఫారసు చేసినట్టు తెలిసింది.

శనివారం రాత్రి తిరుపతికి చేరుకున్న సిట్ సభ్యులైన డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ మార్గమధ్యంలోనే మహిళా వర్సిటీ, కూచువారిపల్లెల్లో జరిగిన ఘటనలకు సంబంధించి వివిధ మార్గాల్లో వీలైన మేరకు సమాచారం సేకరించారు. ఆదివారం ఉదయం 10.45 గంటలకు ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పోలింగ్ మరునాడు 14వ తేదీన పద్మావతీ మహిళా వర్సిటీలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంపై టీడీపీ వర్గీయుల దాడి చేసి ధ్వంసం చేయడం వంటి ఘటనలకు సంబంధించిన కేసుల ఎఫ్ఐఆర్‌లు పరిశీలించారు.ఆ స్టేషన్ సీఐ మురళీ మోహన్ నుంచీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఐఆర్ల ప్రతులు, సీసీ ఫుటేజీలు, ఫొటోలతో కూడిన పెన్ డ్రైవ్‌లను సీఐ మురళీమోహన్ సిట్ బృందానికి అందజేశారు. అనంతరం మహిళా వర్సిటీలో నానీపై దాడి జరిగిన ప్రాంతాన్ని, టీడీపీ వర్గీయులు ఆందోళన చేసి పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ప్రదేశాలను పరిశీలించారు. అక్కడినుంచి బయల్దేరి మధ్యాహ్నం 12.20 గంటలకు చంద్రగిరి మండలం కూచివారిపల్లికి చేరుకున్నారు.చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, సీఐ రామయ్యలతో కలసి పోలింగ్ రోజు రాత్రి హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాలను చూశారు. టీడీపీ వర్గీయులు తగులబెట్టిన వైసీపీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని, కారును పరిశీలించారు. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. పోలింగ్ రోజు రాత్రి ఏం జరిగిందో వారిని అడిగి తెలుసుకున్నారు.


మహిళా వర్సిటీ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి ఫొటోలను పరిశీలిస్తున్న డీఎస్పీ రవిమనోహరాచారి


వైసీపీ దాడిలో తగిలిన గాయాన్ని చూపిస్తున్న కూచివారిపల్లివాసి

టీడీపీ ఏజెంటును కొట్టినందునే గొడవ

పోలింగ్ రోజు వికలాంగునితో ఓటు వేయించేందుకు యత్నించిన టీడీపీ ఏజెంట్ మురళీధర్‌ను రామిరెడ్డిపల్లికి చెందిన వైసీపీ వర్గీయులు అడ్డుకుని దాడి చేసి కొట్టారని కూచివారిపల్లి గ్రామస్తులు ఆరోపించారు. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి రావడంతో ఆ పార్టీ సర్పంచ్ రామిరెడ్డిపల్లి నుంచీ 200 మందిని రప్పించి తమపై దాడి చేయించారని ఆరోపించారు. పలువురు తమ గాయాలను కూడా చూపించారు. తాము టీడీపీ మద్దతుదారులమని, అందుకే తమపై దాడి చేశారని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లపై కేసులు పెట్టారని, తిరుపతిలో డాక్టర్‌గా పనిచేస్తూ సోమవారం నైట్ డ్యూటీలో వున్నప్పటికీ కేసులు పెట్టించారని గ్రామ మాజీ సర్పంచ్ కవిత చెప్పారు. పెద్దఎత్తున ఘర్షణ జరిగిందని, ఆ కారణంగా సర్పంచ్ ఇల్లు, కారు ఎవరు తగులబెట్టారో, మరో కారు ఎవరు ధ్వంసం చేశారో గుర్తించలేకపోయామని గ్రామస్తులు వివరించారు. జరిగిన ఘటనలపై ఆధారాలుంటే ఇవ్వాలని డీఎస్పీ రవిమనోహరాచారి గ్రామస్తులకు సూచించారు.అనంతరం సిట్ అధికారులు పొరుగునే వున్న రామిరెడ్డిపల్లి గ్రామానికి 1.05 గంటలకు వెళ్ళి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కారు డ్రైవర్ ఈశ్వరయ్యను విచారించారు. అతడి నుంచీ ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను అడిగి తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. తాను, మోహిత్ రెడ్డి కారులో వస్తుంటే గ్రామస్తులు అడ్డుకుని వెంటనే కారు తాళాలు, ఐడీ కార్డులు, లైసెన్సు లాక్కొన్నారని ఈశ్వరయ్య సిట్ బృందానికి వివరించారు. దాదాపు 30 నిమిషాల పాటు గ్రామంలోని పలువురిని సిట్ బృందం విచారించింది.

ఎఫ్ఐఆర్‌లలో లోపాల గుర్తింపు... కొందరిపై చర్యలకు సిఫారసు

కూచివారిపల్లిలో పోలింగ్ రోజు రాత్రి జరిగిన ఘర్షణలు, మరుసటి రోజు మహిళా విశ్వవిద్యాలయం వద్ద టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం, తదనంతర ఉద్రిక్తతలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లలో పలు లోపాలను సిట్ బృందం గుర్తించినట్టు సమాచారం. అలాగే ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంలోనూ, హింసాత్మక ఘటనలు జరిగాక వాటిని


కూచివారిపల్లిలో దహనమైన ఇంటి పరిశీలన

నియంత్రించడం లోనూ, కేసుల నమోదులోనూ బాధ్యతా రహితంగా వ్యవహరించిన కొందరు అధికారులపై చర్యలకు కూడా సిట్ బృందం సిఫారసు చేసినట్టు తెలిసింది. సిట్ ఐజీ అనుమతితో ఈ రెండు ఘటనలపై మరింత లోతుగా విచారణ జరపాలని సిట్ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. సుమారు 70-80మందిని విచారించాల్సి వుందని, ఘటనల పూర్వాపరాలను బట్టి పోలీసు అధికారులు ఏయే సందర్భాలలో ఏ స్థాయిలో విఫలమయ్యారన్నది అంచనా వేయడానికి వీలవుతుందని వారు భావిస్తున్నట్టు తెలిసింది. సిట్ ఐజీ అనుమతిస్తే ఆ మేరకు విచారణ లోతుగా కొనసాగనుంది.

పోలీసు అధికారుల్లో లోపించిన పారదర్శకత

పోలింగ్ రోజు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల్లో పోలీసు అధికారులు పారదర్శకంగా వ్యవహరించలేదు. ముఖ్యంగా కూచివారిపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో పోలింగ్ రోజు వాస్తవంగా ఏం జరిగింది? ఆ రోజు రాత్రి కూచివారిపల్లిలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడానికి కారకులు ఎవరు? అన్న విషయాలు పోలీసు అధికారులు ఇంతవరకూ వెల్లడించలేదు. అలాగే పోలింగ్ మరుసటి రోజు మహిళా వర్సిటీ వద్ద నానీపై హత్యాయత్నం జరిగిన సందర్భంలో ఆయన గన్‌మ్యాన్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు దాడికి యత్నించిన వైసీపీ వ్యక్తులు గాయపడిన విషయం కూడా పోలీసు అధికారులు వెల్లడించలేదు. హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ వ్యక్తుల్లో ఇద్దరు గన్‌మ్యాన్ కాల్పుల్లో గాయపడ్డారని గానీ, వారి వివరాలు గానీ వెల్లడించలేదు. అలాగే నానీపై హత్యాయత్నం తర్వాత టీడీపీ వర్గీయులు వర్సిటీ ఎదుట ఆందోళనకు దిగినపుడు అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిపై దాడి జరిగినట్టు తెలిపే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దానిపై కూడా పోలీసు అధికారులు ఇంతవరకూ స్పందించలేదు. కనీసం దాడి జరిగిందా లేదా అన్నది కూడా స్పష్టత ఇవ్వడం లేదు. చిన్నపాటి కేసులపై కూడా ప్రెస్‌మీట్లు పెట్టి మరీ వివరాలు వెల్లడించే అధికారులు ఇంత తీవ్ర ఘటనలు జరిగినపుడు మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఎవరి ఆదేశాలతో ఈ విషయాలను గోప్యంగా వుంచారు? ఎందుకోసం అలా చేశారు? అన్న ప్రశ్నలకు అధికారుల నుంచీ సమాధానాలు లేవు. ఈ అంశాలపై సిట్ అధికారులు ఎంత వరకూ దృష్టి సారించారో, ఏ మేరకు వివరాలు సేకరించి నివేదికలో పొందుపరిచారో తేలాల్సి వుంది.

పక్కా ప్రణాళికతోనే హత్యాయత్నం!

- పోలీసు అధికారులకు ముందస్తు సమాచారం
- ఎమ్మెల్యే చెవిరెడ్డి, కుటుంబీకుల కాల్ డేటా పరిశీలించండి!
- సిట్ అధికారులకు పులివర్తి నానీ ఫిర్యాదు

పక్కా ప్రణాళికతోనే, ఉద్దేశపూర్వకంగా తనపై హత్యాయత్నం జరిగిందని తిరుపతి జిల్లా చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ ఈసీ నియమించిన సిట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి తిరుపతిలోని యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ వద్ద సిట్ అధికారులను నానీ కలిశారు. హత్యాయత్నం ఘటనతో పాటు కూచివారిపల్లిలో జరిగిన ఘర్షణల గురించి కూడా నానీని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నానీ మాట్లాడుతూ తనను అంతమొందించేందుకు పక్కా ప్రణాళికతోనే దాడి చేయించారన్నారు.దీనికి సంబంధించి కేసులో నిందితులుగా నమోదైన భానుకుమార్‌రెడ్డి, గణపతి రెడ్డి కేవలం పాత్రధారులేనని, తెర వెనుక వున్న అసలైన దోషులను గుర్తించాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించి వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన సోదరుడు రఘునాథరెడ్డి, వైసీపీ నాయకులు భానుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డిల నడుమ జరిగిన ఫోన్ సంభాషణలను బయట పెట్టాలని, దానికోసం వారి కాల్ డేటాను పరిశీలించాలని కోరారు. వారిని అరెస్టు చేసి విచారణ జరపాలని కోరారు. లేదంటే కేసు విచారణను ప్రభావితం చేసే అవకాశముందన్నారు. అలాగే తనపై హత్యాయత్నానికి సంబంధించి పోలీసు అధికారులకు ముందుగానే సమాచారం వుందన్న అనుమానం వ్యక్తం చేశారు. అందుకే తనపై దాడి జరిగిన తర్వాత 40 నిమిషాల పాటు పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకోలేదని సిట్ అధికారులకు చెప్పారు. దాడి గురించి వారికి సమాచారం ఇచ్చినా కూడా స్పందించలేదన్నారు. దీనిపై కూడా లోతుగా విచారించి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా పోలింగ్ రోజు వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులే పలుచోట్ల టీడీపీ వర్గీయులను రెచ్చగొట్టేలా వ్యవహరించారని ఆరోపించారు. తన స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లికి వైసీపీ అభ్యర్థి 17 వాహనాల్లో అనుచరులను తీసుకెళ్ళి గ్రామస్తులను రెచ్చగొట్టారని చెప్పారు. అక్కడి నుంచీ కాశిపెంట్ల, కూచివారిపల్లెలకు వెళ్ళి అక్కడా ఘర్షణలకు, ఉద్రిక్తతలకు కారణమయ్యారని వివరించారు. పులివర్తివారిపల్లి, కాశిపెంట్ల, కూచివారిపల్లి గ్రామాల్లో వారి తీరును విచారించాలని కోరారు. కూచివారిపల్లిలో ఒకే ఘటనపై వైసీపీ అభ్యర్థి మోహిత్ తన కారు డ్రైవరుతోనూ, తన పీఆర్వోతోనూ వేర్వేరుగా ఫిర్యాదులు చేయించి రెండు కేసులు నమోదు చేయించారని సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసుల్లో సంబంధం లేని వారిని నిందితులుగా చేరుస్తున్నారని వివరించారు. కేసుతో సంబంధం లేని వారి పేర్లు తొలగించాలని కోరారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా పులివర్తి నానీ సిట్ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు.


సిట్ డీఎస్పీ రవిమనోహరాచారికి తనపై దాడి జరిగిన తీరును వివరిస్తున్న పులివర్తి నాని




అంకురార్పణ పూజలు - ప్రత్యేక అలంకరణలో ఉత్సవర్లు

కోనకు చేరిన పెంచల స్వామి

- గిరిజనవాడల్లో అంబరాన్నంటిన సంబరాలు
- నృసింహుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

డక్కిలి, మే 19 : వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలంలో వున్న గోనుపల్లి, గోనుపల్లి గిరిజన వాడలు ఆదివారం గోవింద నామస్మరణతో మార్మోగాయి. తప్పెట్లు, తాళాలు, గిరిజన నృత్యాలు, బాజాభజంత్రీల నడుమ ఉభయ దేవేరులతో కలిసి పెంచల నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల కోసం పెంచలకోనకు బయల్దేరారు. గోనుపల్లిలోని పెంచల ఆలయం నుంచి పల్లకిలో చెంచులక్ష్మీ దేవి ఇంటికి చేరుకొన్నారు. కొత్తల్లుడి రాకతో గోనుపల్లి గిరిజన వాడ జనం తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నారె మొలతాడును సారెగా ఇచ్చారు. గిరిజన వాడలోని ప్రతి ఇంటి వద్ద నేరేడు ఆకులతో పచ్చటి పందిళ్ళు, ఇండ్ల ముంగిట రంగవల్లులు వేసి వధూవరులకు ఘనంగా స్వాగతం పలికారు. అత్తారింటికి చేరిన వరుడు నరసింహ స్వామిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకొన్నారు.ప్రత్యేక పూజల అనంతరం ముత్తైదువులు వధూవరులను పొలిమేర వరకు సాగనంపారు. పూలతో అలంకరించిన పల్లకీలో దేవేరులతో కలిసి కొలువుదీరిన స్వామివారు గ్రామ శివారులోని గొల్లబోయి ఆలయానికి చేరుకొని తొలిదర్శనం గొల్లబోయికి ఇచ్చారు. అనంతరం బోయీలు పల్లకీ మోసుకొంటూ 6 కిలో మీటర్లు కాలినడకన పెంచలకోనకు పయనమయ్యారు.సహజసిద్ధమైన ప్రకృతి అందాల నడుమ వందలాది భక్తుల మధ్య స్వామివారు కోనకు చేరుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు, ప్రధాన అర్చకులు రామయ్య స్వామి, పెంచలస్వామి శశి స్వామి, అర్చకులు, భక్తులు స్వాగతం పలికారు. ఐదురోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుపుకొని తిరిగి స్వామి వారు ఈ నెల 25వ తేదీన గోనుపల్లికి చేరుకొంటారు. ఈ ఐదు రోజుల పాటు గోనుపల్లి వాసులు మాంసాహారాలకు దూరంగా వుంటారు. పెంచలకోనలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక స్నపన తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు.


గోనుపల్లి నుంచి కోనకు పల్లకీపై వస్తున్న శ్రీవారు

- కోనలో ఉత్సవాలకు అంకురార్పణ

పెంచలకోనలోని శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యాయి. ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక యాగశాల ఏర్పాటుచేసి హోమాలు జరిపారు. అర్చకులు పుట్ట మన్ను తీసుకువచ్చి అందులో నవధాన్యాలు కలిపి కలశస్థాపన చేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. అనంతరం కోన వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు.


శ్రీవారికి ప్రసాదంగా అటవీ ఉత్పత్తులు తీసుకొస్తున్న గిరిజన మహిళలు




మహిళా వర్సిటీలో స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధనరాజు

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

- ఎస్పీ హర్షవర్ధనరాజు హామీ

తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్), మే 19 : కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి గట్టి చర్యలు తీసుకుంటానని ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు.జిల్లా ఎస్పీగా ఆదివారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుపతికి రావడం సంతోషంగా వుందన్నారు.అయితే ప్రస్తుత పరిణామాల నడుమ బాధ్యతలు తీసుకోవడం సవాలుతో కూడుకున్నది అయినప్పటికీ ప్రణాళికాబద్ధంగా పని చేసి అధిగమిస్తానని చెప్పారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో రాజీ లేకుండా పనిచేస్తానని చెప్పారు.అంతకు ముందు ఎస్పీకి ట్రైనీ ఎస్పీ దేవరాజ్‌మనీష్ పాటిల్, ఏఎస్పీలు కులశేఖర్, వెంకట్రావు, రాజేంద్ర, విమల కుమారి, శ్రీనివాసులు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో ఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం కలెక్టర్‌తో కలిసి మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేసి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూముల వద్ద భద్రతను పరిశీలించారు.మీడియా సెంటర్ ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశారు. డీఆర్వో పెంచలకిషోర్, ఏఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.


తిరుమలలో కొనసాగిన రద్దీ

తిరుమల, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ పాపవినాశనం సర్కిల్ వరకు వ్యాపించింది. కల్యాణవేదిక వద్ద నుంచి భక్తులను దఫాల వారీగా ముందుకు పంపుతున్నారు. వీరికి 24 గంటల దర్శన సమయం పడుతోంది. గదులకు డిమాండ్ కొనసాగుతూనే ఉంది. గదిని పొందేందుకు రెండు నుంచి మూడు గంటల సమయం పడుతోంది.రద్దీ నేపథ్యంలో పాపవినాశనం, శ్రీవారి పాదాల మార్గాల్లో రెండురోజులుగా నిలిపివేసిన వాహనాలను ఆదివారం తిరిగి అనుమతించారు.



ఆఫ్రికాలో మైనింగ్ అవసరాల కోసమే భారీ వాహనాలు పంపుతున్నాం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి



తిరుపతి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికాలో తాము నిర్వహిస్తున్న మైనింగ్ కాంట్రాక్ట్ అవసరాల కోసమే ఇండియా నుంచి ప్రొక్లైయిన్లు, టిప్పర్లు ముంబై పోర్టునుంచి పంపుతున్నామని, టీడీపీ నేతలు ఆరోపిస్తున్నట్టు వాటిలో నగదు, బంగారు పంపించడం లేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి చెప్పారు. ఆదివారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు.తాము నిర్వహిస్తున్న పీఎల్ఆర్, జస్విన్ సంస్థల తరపున ఆఫ్రికాలో ఫెరో మ్యాంగనీస్, ఫెరో సిలికా మైనింగ్ కాంట్రాక్ట్ పనులు చేపట్టామన్నారు. దశలవారీగా వంద భారీ వాహనాలను, యంత్రాలను పంపుతున్నామన్నారు.దీనికే దేశాలు వదిలి పారిపోతున్నామని చెప్పడం హాస్యాస్పదమన్నారు.పోలింగ్ శాతం పెరగడానికి కారణం మహిళలేనని, ఐప్యాక్ సర్వేలో మహిళలు తమకే ఓట్లు వేసినట్టు తేలిందన్నారు.ఈ- ఆఫీస్ అప్డేట్ చేయడం ఏడాదికోసారి జరుగుతుందని, దాన్ని కూడా అడ్డుకుంటున్నారని, ఈ రెండు వారాలు అడ్డుకుంటే తమకు నష్టమేం లేదన్నారు. తొలినుంచి తమ నాయకుడు వైనాట్ 175 అని చెబుతున్నప్పటికీ, తాను మాత్రం 150 పైన వస్తాయనే తొలి నుంచీ చెబుతున్నానని చెప్పుకొచ్చారు.

పిడుగుపాటుకు ఒకరి మృతి

పుత్తూరు, మే 19: పుత్తూరు మండలం కృష్ణసముద్రం గ్రామానికి చెందిన అన్బుకుమార్ (45) ఆదివారం మధ్యాహ్నం పిడుగు పడి మరణించారు. గ్రామానికి సమీపంలోని రామసముద్రం చెరువు వద్ద మేకలు మేపు కుంటుండగా పిడుగు పడింది. వెంటనే నగరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.


మృతుడు అన్బుకుమార్

నానీ హత్యకు వైసీపీ కుట్ర : టీడీపీ


మీడియా సమావేశంలో తిరుమలరెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 19: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ హత్యకు వైసీపీ కుట్ర పన్నిందని రామచంద్రాపురం మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఆరోపించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ల రోజే వైసీపీ నాయకులు టీడీపీ శ్రేణులపై దాడికి తెగబడ్డారని అన్నారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత డొల్లగా ఉందని తెలిపారు. భద్రత పక్కాగా ఉంటే వైసీపీ నాయకులు స్ట్రాంగ్ రూమ్‌కు సమీపంలోనే సాక్షాత్తూ టీడీపీ అభ్యర్థి నానీపైనే దాడి ఎలా చేస్తారని ప్రశ్నించారు. రామచంద్రపురం మండలంలో భానుకుమార్‌రెడ్డి రౌడీయిజం చేస్తున్నారని, పోలీసు స్టేషన్‌లోనూ ఆయనపై రౌడీషీట్ నమోదై ఉందని గుర్తు చేశారు. నానీపై హత్యాయత్నం కేసులో అమాయకులను ఇరికించారని అన్నారు. రామచంద్రాపురం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ శ్రేణులు నానీపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. నానీపై దాడి సందర్భంగా కాల్ డేటా బయటికి తీసి, బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు గోపీనాథ్‌రెడ్డి, మునిరామిరెడ్డి, ధనుంజయరెడ్డి, హరిప్రసాద్, రాజారెడ్డి, రవిప్రసాద్, రంజిత్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

తుడా నిధులతో నిర్మించిన రచ్చబండ ధ్వంసం



మంగళం, మే 19: తుడా నిధులను వెచ్చించి నిర్మించిన రచ్చబండను ధ్వంసం చేసేశారు. మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీ గంగాదేవి ఎస్టీకాలనీని ఆనుకుని ఉన్న భూమిలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో మంజూరుచేసిన నిధులతో రచ్చబండను నిర్మించారు. చెన్నాయగుంట గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 70లో గల భూమిలో స్థలానికి ప్రహరీ ఏర్పాటు చేసుకునే క్రమంలో ఆ భూమికి సంబంధించిన వారు కాలువ పోరంబోకు స్థలాన్ని కూడా తమ స్థలంలోకి కలుపుకునేందుకు గాను అడ్డుగావచ్చిన రచ్చబండను జేసీబీతో నేలమట్టం చేసినట్టుగా స్పష్టంగా తెలుస్తోంది. ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పంచాయతీ పరిధిలో ప్రజా ప్రయోజనార్థం నిర్మించిన రచ్చబండను కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక కాలనీవాసులు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

నానీకి పలువురి పరామర్శ


నానిని పరామర్శిస్తున్న చిట్టిబాబు తదితరులు

తిరుచానూరు, మే 19: వైసీపీ మూకల దాడిలో గాయపడిన టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని పలువురు పరామర్శించారు. ప్రస్తుతం నాని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిట్టిబాబు, బొజ్జల బృందమ్మ పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


బ్రాహ్మణకాల్వ గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ చిరంజీవి

రామచంద్రాపురం, మే 19: మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామచంద్రాపురం ఎస్‌ఐ చిరంజీవి హెచ్చరించారు. మండలంలోని బ్రాహ్మణకాల్వలో ఆదివారం పోలీసు కవాతు నిర్వహించారు. పోలింగ్ సందర్భంగా బ్రాహ్మణకాల్వలో పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణలు చోటు చేసుకుని పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో హింసాత్మక ఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణానికి సహకరించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సురేష్, శ్రీకాంత్, రమణ, యోబు తదితరులు పాల్గొన్నారు.

27నుంచి కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు


కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

చంద్రగిరి, మే 19: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు ఉత్సవర్లను ఆలయం నుంచి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ, హనుమాన్ సమేత శ్రీరామచంద్రమూర్తి, రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహిస్తారు. వసంత రుతువులో లభించే పుష్పాలను, ఫలాలను సమర్పించి స్వామివారి దివ్యానుగ్రహం పొందడమే వసంతోత్సవం అంతరార్థం. రెండవ రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరగనుంది. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వీధి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ వసంతోత్సవంలో పాల్గొన దలిచిన భక్తులు రూ.516 చెల్లించి పాల్గొనవచ్చు. ఇందులో పాల్గొన్న భక్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు.

ఆర్జిత సేవల రద్దు..

వసంతోత్సవాల సందర్భంగా ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు కళ్యాణోత్సవం, స్వర్ణ పుష్పార్చన, అష్టోత్తర శతకళశాభిషేకం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా వసంతోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అపోలో ఆస్పత్రిలో అత్యాధునిక న్యూరో సర్జరీ సేవలు


డాక్టర్ బాలమురుగన్

తిరుపతి(వైద్యం), మే 19: అత్యంత అరుదైన న్యూరోసర్జరీ సేవలను అపోలో ఆస్పత్రిలో అత్యాధునిక పద్ధతులతో అందుబాటులోకి తీసుకువచ్చామని న్యూరో సర్జన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ బాలమురుగన్ తెలిపారు. స్థానిక లక్ష్మీపురం సర్కిల్లోని అపోలో ఆస్పత్రిలో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అపోలో ఆస్పత్రిలో దేశ విదేశాల్లో ఉన్న అత్యాధునిక వైద్య పరికరాలు, వైద్య నిపుణులు అందుబాటులో ఉండటం వలన తలలో చిన్నపాటి రంధ్రంతోనే న్యూరో సర్జరీ చికిత్సలను సులభంగా నిర్వహిస్తున్నామన్నారు. దీంతో రోగులు సర్జరీ జరిగిన 3-4 రోజుల్లోనే పూర్తిగా కోలుకొని డిశ్చార్జి అవుతారన్నారు. న్యూరోసర్జరీలోని అధునాతన పద్ధతులు, శస్త్ర చికిత్సా విధానాలు, రోగులు పాటించాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



భాకరాపేట, మే 19: చిన్నగొట్టిగల్లు మండలం ఎడంవారిపల్లెలో జరుగుతున్న 73వ మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ద్రౌపదీ దేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. పచ్చని పందిళ్లు వేసి మంగళ వాయిద్యాలతో వేదపండితుల మంత్రోచ్ఛరణతో ద్రౌపదీ దేవి కళ్యాణానికి ముక్కోటి దేవతలు, మునులు, సామంత రాజులను ఆహ్వానించారు. అమ్మవారికి అక్షింతలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అన్నదాన కమిటీ అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముద్దుకృష్ణయ్య, భారతమ్మ, ఉమాపతి, కృష్ణయ్య, జ్యోతినాథ్, రెడ్డిరాణి, గురుమోహన్, తదితరులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై

గోవిందుడి విహారం



కల్పవృక్ష వాహనం - సర్వభూపాల వాహనం


వాహన సేవల్లో అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుపతి(కల్చరల్), మే 19: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7గంటలకు కల్పవృక్ష వాహనంపై ఆలయ మాడవీధుల్లో స్వామివారు విహరించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు స్వామి వారికి ఊంజల్ సేవ జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల ముందు నిర్వహించిన విచిత్ర వేషధారణ, కోలాటం, నాట్యం వంటి కళాప్రదర్శనలు పురజనులను ఆకట్టుకున్నాయి. భక్తులు స్వామి వారికి హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వాహనసేవ ముందు వేదపండితులు, జియ్యరు స్వాములు స్వామివారిని కీర్తిస్తూ కదిలారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయరుస్వామి, చిన్నజీయరు స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, భక్తులు పాల్గొన్నారు.

నేటి వాహనసేవలు:

గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 20వ తేదీ సోమవారం ఉదయం మోహినీ అవతారం, రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు గరుడసేవ జరుగనుంది.


కల్పవృక్ష వాహన సేవలో గుస్సాడి కళాకారులు

అలరించిన నృత్య ప్రదర్శన


శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, మే 19: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి తిరుపతికి చెందిన జయశ్రీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన నగరవాసులను అలరించింది. గణేశ పంచరత్నం, శ్రీమన్నారాయణ, తంబూరి మీటిదవా, భో శంభో, దేవిస్తుతి, ఆనంద నర్తన గణపతి వంటి కీర్తనలకు కళాకారులు కార్తీక శ్రీనిధి, విభ దీక్షిత, ప్రణవి, కోవిధ వర్మ, శాలిని, జాహ్నవి తదితరులు ప్రదర్శించిన నృత్యం నగరవాసులను ఆకట్టుకుంది. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించారు.

పొట్టేలు రక్తంతో గంగమ్మ ఉగ్ర చిత్రం



కుప్పం, మే 19: పండుగైనా, పబ్బమైనా కుప్పం కళాకారుడు పురుషోత్తం కుంచె కదులుతుంది. సందర్భోచితంగా చిత్రాన్ని జాలువార్చి కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటుంది. కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో భాగంగా ఈనెల 20, 21, 22 తేదీలలో అగ్నిగుండం, అమ్మవారి ఊరేగింపు, విశ్వరూప దర్శనం జరగనున్నాయి. జాతర సందర్భంగా గంగమాంబకు జంతు బలులిచ్చి భక్తులు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని ప్రతిబింబించేలా ఆయన పెద్ద కాన్వాస్‌పై పొట్టేలు రక్తంతో చిత్రించిన అమ్మవారి ఉగ్రరూపం భక్తితో కూడిన భయానక రసాన్ని ఆవిష్కరిస్తోంది. ఆరుబయట పొలాలలో పరచిన ఉగ్ర గంగమ్మ చిత్రం కుప్పం ప్రజల మనసులను చూరగొంటోంది.

బీఎల్వోలకు బాకీ రూ.1.06 కోట్లు

● రెండేళ్లుగా అందని గౌరవ వేతనం


చిత్తూరు నగరం సంతపేటలో ఓటరు జాబితా ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్వో (ఫైల్ ఫొటో)

చిత్తూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీఎల్వోలు) ప్రభుత్వం రూ.1.06 కోట్ల బకాయి ఉంది. రెండేళ్లుగా ఎన్నికల క్రతువులో పాల్గొంటున్న వీరికి గౌరవ వేతనం ఇవ్వడంపై అధికారులు చొరవ చూపలేదు. ఏటా ఓటరు జాబితా మార్పు, చేర్పుల్లో వీరిది కీలకపాత్ర. గతేడాది ఎమ్మెల్సీ ఎన్నికలు, తాజాగా సార్వత్రిక ఎన్నికలు జరిగిన నేపథ్యంలో బీఎల్వోలు క్షేత్రస్థాయి వివరాల సేకరణలో నిరంతరం కష్టపడ్డారు. గతేడాది జూలై 21వ తేదీ నుంచి ఇంటింటి ఓటరు సర్వే, ఆ తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితా, సవరణ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, ఓటు స్లిప్పుల పంపిణీతో పాటు పోలింగ్ రోజునా కీలకపాత్ర పోషించారు. ఇలా జిల్లాలో 1771 మంది ఉన్నారు. వీరికి ఆరు నెలలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.3 వేలు గౌరవ వేతనం ఇవ్వాలి. రెండేళ్లగా రూ.6 వేలు చొప్పున రూ.1.06 కోట్ల బకాయిలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఇటీవల జిల్లాకు బడ్జెట్ విడుదలైంది. ఎన్నికల విధులు నిర్వహించిన పీవో, ఏపీవో, ఓపీవో తదితర సిబ్బంది, అధికారులకు పారితోషికం వెంటనే ఇచ్చేశారు. పోలింగ్ రోజునా విధులు నిర్వహించిన బీఎల్వోలకు మాత్రం పైసా ఇవ్వకపోవడంపై వారు అసంతృప్తితో ఉన్నారు.

అదనపు భారం : బీఎల్వోల్లో సగానికిపైగా సచివాలయ ఉద్యోగులుండగా.. మిగినవారు వీఆర్వోలు, వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులు. వీరంతా రెగ్యులర్ డ్యూటీకు అదనంగా బీఎల్వో పనులు చేస్తున్నారు. గతంలో క్రమం తప్పకుండా వచ్చే గౌరవ వేతనం.. రెండేళ్లగా అందడం లేదు.

జడ్పీలో నిధుల దుర్వినియోగంపై విచారణ

● లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన మాజీ అధికారి

చిత్తూరు రూరల్, మే 19: జిల్లా పరిషత్ కార్యాలయంలో బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘ నిధులు దుర్వినియోగమయ్యాయని మాజీ ఉద్యోగులు లోకాయుక్తకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారు. రెండేళ్ల క్రితమే ఈ ఫిర్యాదు ఇచ్చినప్పటికీ అప్పటి సూపరింటెండెంట్ రాజకీయ ఒత్తిడితో విచారణ జరగకుండా ఆపారని విమర్శలున్నాయి. దీనిపై తిరిగి ఆ విశ్రాంత అధికారి ఫిర్యాదు చేయడంతో లోకాయుక్త సీరియస్ అయింది. వెంటనే విచారణ ప్రారంభించి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించింది. దీంతో వారం రోజులుగా జడ్పీలో విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల్లో గుబులు మొదలైంది.

తిరుమల ఘాట్‌లో జింక మృతి


మృతిచెందిన జింక

తిరుమల, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందింది. మొదటి ఘాట్‌రోడ్డులోని ఏడవమైలు వద్ద రోడ్డు దాటుతున్న జింకను వేగంగా వచ్చిన వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయింది.

పుంజుకున్న టమోటా ధరలు


సోమలలో మార్కెట్‌కు పంపేందుకు సిద్ధంగా ఉన్న టమోటాలు

పలమనేరు/సోమల, మే 19: టమోటా ధరలు అనూహ్యంగా పెరిగాయి. శనివారం 15కిలోల బాక్సు రూ.330 ధర పలకగా.. ఆదివారానికి రూ.470కి చేరాయి. పలమనేరు మార్కెట్‌యార్డులో కిలో రూ.30 పలికింది. రెండు నెలలుగా ఈ ధర రూ.10నుంచి రూ.15వరకే ఉండింది. ఈ క్రమంలో రెండు రోజులుగా ధరలు పెరగడంతో రైతులు ఊరట చెందారు. రెండు నెలలు ధరలు లేకపోవడంతో నష్టాలు చవిచూసిన రైతులు.. ఎండల తీవ్రత తగ్గడంతో మరో విడత టమోటా నాటేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇక, సోమల ప్రాంతంలో పడిన వర్షంతో దెబ్బతిన్న తోటలను రక్షించుకోవడానికి రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు.కాగా, వర్షాలతో టమోటా తోటలు దెబ్బతిని దిగుబడి తగ్గడం.. రెండు రోజులుగా చెన్నై, ఆంధ్రప్రాంతం నుంచి టమోటాలను కొనుగోలు చేసకొనేందుకు వ్యాపారులు తరలిరావడంతో ధరలు పెరిగినట్లు చెబుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని కోలారు మార్కెట్‌లోనూ టమోటా ధరలు అమాంతం పెరిగాయని రైతులు తెలిపారు.

తిరుపతి









మాతంగుల సందడి

భక్తులతో కిటకిటలాడిన గంగమ్మ ఆలయం



తిరుపతి(కల్చరల్), మే 19: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో ఐదవ రోజైన ఆదివారం ఉదయం నుంచే ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. సెలవురోజు కావడంతో నగరవాసులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, పొంగళ్లుపెట్టి, వేయికళ్లదుత్తలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం మాతంగి వేషంలో నగరవాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. ఇందులో అనేక కళారూపాలు పాల్గొని సందడి చేశాయి. యువత, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కరుణాకరరెడ్డి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ... అనాదిగా ఈ జాతరను తిరుపతివాసులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు గంగమ్మను ప్రార్థించడం ద్వారా మంచి జరుగుతుందని నమ్ముతున్నారన్నారు. జాతరలో భాగంగా ఇందిరా మైదానంలో ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు వినాయక నాటక మండలి, రేణిగుంట వారు ప్రదర్శించిన శివలీలలు నాటకం అలరించింది. ఈ నాటిక రచన దస్తగిరి, సంగీతం, దర్శకత్వం కృష్ణమూర్తి. ప్రదర్శన అనంతరం కళాకారులను నిర్వాహకులు బీఎస్ రెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి సత్కరించారు.

రేపటి జాతర ఏర్పాట్లు పూర్తి

మంగళవారం జరుగనున్న తిరుపతి గంగజాతర కోసం ఏర్పాట్లు పూర్తైనట్లు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ చెప్పారు. ఆదివారం ఉదయం ఆమె ఆలయంలో మీడియాతో మాట్లాడుతూ మంగళవారం, బుధవారం రెండు రోజులు జరిగే జాతర చివరి అంకానికి దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. 75 మంది చొప్పున రెండు షిఫ్టుల్లో పారిశుధ్య కార్మికులు నిరంతరం పనిచేస్తారని తెలిపారు. జాతర నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, భక్తులకు మెరుగైన సేవలు అందజేస్తామన్నారు.





అనువంశికంగా పాల్గొంటున్నాం



● కైకాల వంశస్తుడు సాంబయ్య

తిరుపతి జాతర అంటే ముందుగా గుర్తుకు వచ్చేది కైకాల వంశస్తులు. జాతర వారం రోజులు వీరికి క్షణం తీరిక ఉండదు. జాతర చాటింపు మొదలు చివరన విశ్వరూపదర్శనం పూర్తయ్యే వరకు వీరి పాత్ర ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంటుంది. జాతరలో కైకాలవారి పాత్ర గురించి సాంబయ్య మాటల్లోనే... మా పూర్వుల నుంచి గంగమ్మ ఆలయంతో మాకు ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఆలయం దేవదాయ శాఖ పరిధిలో లేని సమయంలో మిరాశీదారులుగా ఉండేవారం. ఇపుడు అటువంటిది ఏదీ లేదు. వంశాచారంగా అమ్మవారికి సేవ చేస్తున్నాం. ఆలయ అధికారులు అన్ని విధాలుగా సహకరిస్తున్నారు. మా నాన్న తరువాత నేను గత 20 సంవత్సరాలుగా అమ్మవారి సేవచేస్తున్నాను. నా తరువాత నా కుమారుడు ఈ సేవ చేయడానికి సిద్ధపడుతున్నాడు. మా పెద్దలు చేసుకున్న పుణ్యంతో మేము మా వంతుగా అమ్మవారికి సేవ చేస్తున్నాం.



జాతరలో నేడు: జాతరలో సోమవారం భక్తులు సున్నపు కుండలు సమర్పించి అమ్మవారిని సేవిస్తారు.







భక్తులకు అంబలి పంపిణీ




తిరుపతి (జీవకోన), మే 19: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని టీడీపీ నేత, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు స్థానిక విజయ డయోగ్నోస్టిక్స్ వద్ద ఆదివారం అంబలి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మోహన్‌రెడ్డి, సన్ను, నెల్లూరు బాబు, ఖాదర్, ఆది తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా వున్న రోడ్డులో భక్తులకు అంబలి పంపిణీ చేశారు.

డాక్టరేట్ ప్రదానం



ఉదిత్‌సాగర్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 19: బెంగళూరుకు చెందిన భారతీయ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ తిరుపతికి చెందిన గంధవళ్ల ఉదిత్‌సాగర్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బెంగళూరులో ఆదివారం నిర్వహించిన ఆ వర్సిటీ స్నాతకోత్సవంలో ఉదిత్‌సాగర్‌రెడ్డి గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. సామాజిక సేవ చేసినందుకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

నేడు జలశక్తి కమిటీ రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 19: జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇద్దరు సభ్యుల బృందం పద్మావతి యూనివర్శిటీకి సోమవారం రానుంది. జాతీయ నీటి పురస్కారం కోసం గత డిసెంబరులో యూనివర్శిటీ దరఖాస్తు చేసుకుంది. దీంతో యూనివర్శిటీలో నీటి పొదుపు, నిల్వ చేసే విధానం, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత, గ్రీన్ హౌస్, ఔషధ మొక్కల పెంపకం, హాస్టళ్లలోని వ్యర్థాలతో ఎరువుల తయారీ, ఇంకుడు గుంతల ఏర్పాటు వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఈ క్రమంలో జలశక్తి కమిటీ సభ్యులు వీసీ భారతితోనూ సమావేశం కానున్నారు. అన్నీ అనుకూలిస్తే, జూన్‌లో యూనివర్సిటీ జాతీయ నీటి పురస్కారానికి ఎంపిక కానుంది.

రైల్వే స్టేషన్ కిటకిట



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీగా వున్న దృశ్యం

తిరుపతి(సెంట్రల్) మే 19: రోజు రోజుకూ ప్రయాణికుల రద్దీ పెరగడంతో తిరుపతి రైల్వే స్టేషన్ కిటకిటలాడుతోంది. వేసవి సెలవులతో పాటు పోలింగ్ ముగిసిన అనంతరం దేశం నలుమూలల నుంచి రైలు మార్గం ద్వారా తిరుమలకు భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. తిరుపతి నుంచి ప్రతిరోజూ వందకు పైగా రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. వారాంతరం కావడంతో రద్దీ ఊహించనంతగా పెరిగింది. రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా విశ్రాంతి గదులు అంతంత మాత్రంగా ఉన్నాయి. ప్రయాణికులు ఎక్కడ స్థలం దొరికితే అక్కడే విశ్రాంతి తీసుకొంటున్నారు. ఉన్నత శ్రేణిలో ప్రయాణించే వారి అవస్థలు వర్ణనాతీతం. రైల్వే అధికారులు స్పందించి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

పుచ్చలపల్లికి ఘన నివాళి



పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), మే 19: అవినీతి నిర్మూలన కోసం పుచ్చలపల్లి సుందరయ్య చూపిన బాటలో పోరాటాలు చేస్తామని సీపీఎం నాయకులు ప్రతిజ్ఞ చేశారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటం పెట్టి నివాళులు అర్పించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ సుందరయ్య బాల్యంనుంచే సామాజిక సేవలు చేస్తూ, జమిందారీ విధానాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు నేటి యువతరానికి ఆదర్శం కావాలన్నారు. నాయకులు ఎం.నాగార్జున, జయచంద్ర, సాయిలక్ష్మి, మాధవ్, వేణుగోపాల్, బుజ్జి, అక్బర్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ



సెంట్రల్ బస్సు స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుపతి(ఆర్టీసీ), మే 19: ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా సెంట్రల్ బస్సు స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. వివిధ పరీక్షల ఫలితాలు, దక్షణాదిన ఎన్నికల ముగింపు, వేసవి సెలవులు ముగింపు దశలో ఉండటంతో నలువైపుల నుంచి ప్రయాణికులు తిరుపతి, తిరుమల బాటపట్టారు. ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా తిరుపతి బస్టాండు ప్రయాణికుల రాకపోకలతో రద్దీగానే ఉంటోంది. రిజర్వేషన్ కౌంటర్లలో కూడా ప్రయాణికులు బారులుతీరారు. ఈ పరిస్థితి ఆదివారం మరింత ఎక్కువైనా రద్దీకి తగ్గట్టు బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. హైదరాబాదు, బెంగళూరు, తమిళనాడు, నెల్లూరు, విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, పడమటి మండలాలకు బస్సుల కొరత ఏర్పడింది. ఆయా ప్లాట్‌ఫామ్‌ల వద్ద ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూడటం కనిపించింది. తిరుమలలో కూడా రద్దీ నెలకొనడంతో బయట నగరాలకు వెళ్లే బస్సులన్నీ కనుమదారిలోనే నడుస్తున్నాయి. ఇదికూడా ఒక కారణంగా తెలుస్తోంది. చాలా మంది ప్రైవేటు బస్సులు, టాక్సీల వైపు మొగ్గుచూపారు. మరికొందరు రైల్వేస్టేషన్ బాటపట్టారు. అధికారులు కూడా బస్సులను సర్దుబాటు చేయలేక తలలు పట్టుకున్నారు. బస్టాండు దరిదాపుల్లో, తిరుమల బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా కనిపించింది. దీని ప్రభావంతో జిల్లా ఆదాయం గత మూడు రోజులుగా రూ.2కోట్లు దాటింది. ఇందులో మూడు భాగాలు తిరుమల ఘాట్ బస్సుల ద్వారానే లభించడం విశేషం.



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పాలనావేత్తలకు ఆదర్శప్రాయుడు నీలం సంజీవరెడ్డి

హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్



సావనీర్‌ని ఆవిష్కరిస్తున్న ఏపీహైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ తదితరులు

తిరుపతి రూరల్, మే 19: గ్రామ సర్పంచ్ నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అత్యున్నత హోదా ఉన్న రాష్ట్రపతి వరకు ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించిన నీలం సంజీవరెడ్డి దేశంలోని పాలనావేత్తలకు ఆదర్శప్రాయంగా నిలిచారని ఏపీ హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. తిరుపతిలోని డీఆర్‌డీఏ సమావేశమందిరంలో భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమీ(అగ్రశ్రీ) ఆధ్వర్యంలో ఆదివారం నీలం సంజీవరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మానవహక్కులు-భారత రాజ్యాంగంలోని ఆర్టికల్21 అనే అంశంపై నిర్వహించిన స్మారక ఉపన్యాసంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు న్యాయస్థానాలు అండగా నిలుస్తాయని, మానవహక్కుల గురించి వివిధ న్యాయస్థానాల్లో వెలువరించిన అనేక తీర్పులను సోదాహరణంగా వివరించారు. అగ్రశ్రీ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ డి.సుందరరామ్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య వజ్రోత్సవాలను పురస్కరించుకుని, ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి, దేశానికి వివిధ హోదాల్లో నిస్వార్థ సేవలందించిన నీలం సంజీవరెడ్డి పేరిట 2024సంవత్సరానికి రాష్ట్రంలో 5మంది ప్రముఖులకు ఈపురస్కారాలు ప్రదానం చేస్తున్నామని వివరించారు. ఇందులో జస్టిస్ ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్ ఎ.లక్ష్మీనాథ్(మహారాష్ట్ర నేషనల్ లావర్సిటీ వీసీ), ప్రొఫెసర్ వి.మురళి (ఎస్వీయూ మాజీ వీసీ), ప్రొఫెసర్ జి.సుబ్రమణ్యం(స్విమ్స్ మాజీ డైరెక్టర్), జె.మురళి(ఏపీగ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌సంస్థ రిటైర్డ్ డైరెక్టర్)లకు పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకుముందు నీలం సంజీవరెడ్డి రాష్ట్ర పురస్కార గ్రహీతల గౌరవార్థం అగ్రశ్రీ రూపొందించిన ప్రత్యేక సావనీర్‌ని ఆవిష్కరించారు. ఏపీఅడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ మాజీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ జి.యతిరాజులు, అగ్రశ్రీ సహ వ్యవస్థాపకురాలు డి.భారతిసుందర్, సంస్థ పాలకమండలి సభ్యులు డి.సుచరిత, ప్రొఫెసర్ ఎం.రాఘవరెడ్డి, ప్రొఫెసర్ వి.వనజాక్షమ్మ, డి.సాయికుమార్, ఎన్.నవీన్‌కుమార్, డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులను ప్రేమతో ఆదరించాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి, సిబ్బంది

తిరుపతి(వైద్యం), మే 19: సమాజంలో హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకుండా వారిని ప్రేమతో ఆదరించాలని, అప్పుడే వారిలో మానసిక వేదన తగ్గి ఆయుష్షు పెరుగుతుందని డీఎంహెచ్‌వో శ్రీహరి అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆయన సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి టౌన్‌క్లబ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ బారిన పడిన వారికి తోటి వారి ఆదరణకు మించిన మందులు లేవని, వారికి ప్రేమను పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారిణి డాక్టర్ హరిత, డీపీఎంవో శ్రీనివాసులు, సిబ్బంది మురళి, మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వేశాలమ్మ గుడికి ఆర్వో ప్లాంట్ వితరణ



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుకుమార్ దంపతులు

తిరుపతి, మే 19 (ఆంధ్రజ్యోతి): భక్తుల తాగునీటి సౌకర్యార్థం స్థానిక వేశాలమ్మ ఆలయానికి ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శ్రీసాయిసుధా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేతలు డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి, డాక్టర్ సుకుమార్ దంపతులు వితరణ చేశారు. ఆదివారం ఆలయంలో ఏర్పాటుచేసిన ప్లాంటును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ఏటా గంగ జాతర సమయంలో ఆలయానికి తమకు తోచినట్టు విరాళంగా అందజేస్తున్నామని తెలిపారు. భక్తులు శుభ్రమైన మంచినీరు తాగేందుకు ఆర్వో ప్లాంట్ అవసరమని ఆలయ అధికారులు చెప్పడంతో దీనిని ఏర్పాటుచేశామన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.28 కోట్లు

తిరుమల, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.28 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 90,721 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 50,599 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు





నిమల్ సిరిపాల దేశీల్వా - చిన్ని జయంత్ - మోషేన్‌రాజు

తిరుమల, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు, ఎమ్మెల్యేలు అవంతి శ్రీనివాస్, రామకృష్ణబాబు, ఆదిమూలం, ఎమ్మెల్సీ భరత్, శ్రీకాకుళం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గోవిందరావు, తమిళ సినీనటుడు చిన్ని జయంత్, శ్రీలంక మంత్రి నిమల్ సిరిపాల దేశీల్వా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

నేడు ఇంటర్ తత్కాల్‌ఫీజు చెల్లింపునకు చివరి గడువు

తిరుపతి(విద్య), మే 19: ఈనెల 24నుంచి జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల తత్కాల్‌ఫీజు చెల్లింపునకు సోమవారంతో గడువుతేదీ ముగుస్తుందని ఆర్‌ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సబ్జెక్టులకు సంబంధించిన ఫీజుతోపాటు అదనంగా రూ.3వేలు నెట్‌బ్యాంకింగ్ ద్వారా ఇంటర్‌బోర్డుకు చెల్లించాలని, ఇప్పటివరకు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకోసం 94414 33025 ఫోన్‌నెంబరుని సంప్రదించాలని కోరారు.

● **జ్ఞానభూమిలో ఇంటర్ హాల్‌టికెట్లు:** ఈనెల 24నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు జ్ఞానభూమిలాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని ఆర్‌ఐవో పేర్కొన్నారు. విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని, హాల్‌టికెట్లపై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని తెలిపారు.

అలరించిన అన్నమయ్య కీర్తనలు



తిరుపతి (కల్చరల్) మే 19: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగే నెలవారి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో పి.రాగసుధ ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు ఆహూతులను అలరించాయి. వీరికి వయోలిన్‌పై పి.హేమకుమార్, తబలాపై వెంకటరమణ వాద్యసహకారం అందించారు. పలువురు శ్రోతలు, అధికారులు పాల్గొన్నారు.

మాంసం ధరలకు రెక్కలు

కేజీ రూ. 300 దాటిన చికెన్ ● కేజీ రూ. 900కు చేరిన మటన్



గూడూరు అర్బన్, మే 19: పొయ్యిమీదకు చేరక ముందే మాంసం ధరలు మండిపోతున్నాయి. చికెన్ ధరలు అమాంతం పెరిగి కేజీ రూ. 300 దాటింది. మటన్ కూడా కేజీ రూ. 900కు చేరుకుంది. గూడూరులో ఆదివారం బాయిలర్ చికెన్ ధర కేజీ రూ. 300లకు విక్రయాలు జరిగాయి. స్కిన్‌లెస్ కేజీ రూ. 330, బోన్‌లెస్ కేజీ రూ. 350 వంతున అమ్ముడయ్యాయి. ఈ ఏడాదిలో ఇదే గరిష్టమని వ్యాపారులు అంటున్నారు. అలాగే పొట్టేళ్లు, మేకపోతు మాంసం కేజీ ధర రూ. 900లకు చేరుకుంది. మాంసం ధరలు పెరిగినా విక్రయాలు మాత్రం తగ్గలేదు. ఆదివారం మాంసం అంగళ్లు కస్టమర్లతో కళకళలాడాయి.

అధైర్యపడకండి..అండగా ఉంటా : పాశిం



కార్యకర్తలతో టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మే 19: వైసీపీ నాయకుల దాడులకు, దౌర్జన్యాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, అందరికీ అండగా ఉంటానని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత ఆయనను కలిశారు. ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు అకారణంగా టీడీపీ నాయకులపై దాడులకు దిగుతున్నారన్నారు. వీరికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో తాను గెలవడం ఖాయమని, కూటమి అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో శ్రావణి, మురళి, శ్రీనివాసులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో గెలుపు కూటమిదే : బీజేపీ



మాట్లాడుతున్న ఎస్ఎస్ఆర్ నాయుడు

వెంకటగిరిటౌన్, మే 19: ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిదే విజయం అని బీజేపీ వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ ఐదేళ్ళుగా ఆల్తూరుపాడు రిజర్వాయర్, స్వర్ణముఖి కెనాల్ కాలువ, నియోజకవర్గం అభివృద్ధి విషయంలో వైసీపీ విఫలమైందన్నారు. సీఎం జగన్ ఆల్తూరుపాడు రిజర్వాయర్ కోసం రీటెండర్ పిలిస్తే నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పనులు ప్రారంభించలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణయ్య, వెంకటరమణ, రమణయ్య పాల్గొన్నారు.

క్యాండిల్స్‌తో హెచ్ఐవీ బాధితులకు సంఘీభావం



నాయుడుపేట, మే 19 : అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం నవజీవన్ స్వచ్ఛంద సంస్థ క్యాండిళ్లను ప్రదర్శించారు. నవజీవన్ ప్రాజెక్టు మేనేజర్ కె. బాలాజీరాజు మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితుల మృతుల ఆత్మకు శాంతి చేకూర్చాలని క్యాండిల్స్‌తో సంఘీభావం తెలుపుతున్నట్లు తెలిపారు. అలాగే హెచ్ఐవీ బాధితులకు, వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది కవిత, శ్రావణి, బాలాజీ, అనురాధ, నందిని, మంజుల, ఐశ్వర్య, ప్రసన్న, మీరమ్మ, భారతి తదితరులు ఉన్నారు.

శ్రీకాళహస్తి రోడ్డు గుంతలమయం



తడ, మే 19 : చుట్టూ పరిశ్రమలు... వాటి కోసం వచ్చే వేలాది వాహనాలు... ఆ రోడ్డు మీదే నడవాలి... కాని ఆ రోడ్డు సంవత్సరాల తరబడి గోతులమయంగా ఉంది. అదే తడ-శ్రీకాళహస్తి రోడ్డు. తడ జాతీయ రహదారి నుంచి శ్రీకాళహస్తి-తిరుపతికి వెళ్లేందుకు ఉన్న ఒకే ఒక ఆర్అండ్‌బీ రహదారి అది. చుట్టూ వందలాది పరిశ్రమలకు చెందిన బస్సులు... పరిశ్రమలకు వచ్చే లారీలు, తిరుపతి, శ్రీకాళహస్తిలకు వెళ్లే బస్సులు ఇలా వందలాది వాహనాలు ఈ రహదారిపైనే ప్రయాణిస్తుంటాయి. మూడేళ్లుగా ఈ రహదారి గోతులమయమై ఉంది. ప్రభుత్వం పట్టించుకోవడం మానేసింది. తద్వారా ప్రమాదాలు జరుగుతున్నా ఆ రహదారిని బాగుచేయాలన్న ఆలోచన అటు అధికారులకు కాని, ఇటు ప్రభుత్వానికి కాని ఉన్నట్లు కనబడటం లేదు. ఈ రహదారిని బాగుచేయండి మహాప్రభో అంటూ స్థానికులు అప్పుడప్పుడు వాపోతున్నారు.

మాన్యాలున్నా.. దీపధూప నైవేద్యాలు కరువే..!



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

నాయుడుపేట టౌన్, మే19: పట్టణంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి మాన్యాలున్నా దీప, ధూప నైవేద్యాలకు నోచుకోవడంలేదు. నాయుడుపేట బ్రాహ్మణవీధిలో వెలసిన ఈ ఆలయానికి 37 ఎకరాల మాన్యం భూములున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం పుంజులూరుపాడు, తడ మండలం మాంబట్టు, నాయుడుపేట మండలం ఉద్దిగుంటకండ్రిగ, విన్నమాల, చిల్లకూరు మండలం ఏరూరు, పెళ్లకూరు మండలం చిల్లకూరు ప్రాంతాల్లో మాన్యం భూములున్నాయి. ఈ భూములకు దేవదాయశాఖ అధికారులు వేలంపాటలు నిర్వహిస్తున్నారు. అయినా అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటుంది. చిన్నపాటి వర్షం కురిసినా ఆలయ ప్రాంగణం చిత్తడిగా మారుతుంది. పూజారికి ప్రతినెలా జీతాలిచ్చే పరిస్థితి లేదు. గతేడాది తుపాన్‌కు ఆలయ ధ్వజస్తంభం విరిగిపడిపోయింది. ఇప్పటికీ కొత్త ధ్వజస్తంభం ఏర్పాటుచేసి కుంభాభిషేకం నిర్వహించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి ఆలయ భూముల నుంచి కౌలు వసూళ్లు చేసి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కలవకొండలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిల్లకూరు, మే19: మండలంలోని కలవకొండలో ఆదివారం అంకురార్పణ కార్యక్రమంతో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంగ కాలువ ఇలా... నీరు పారేదెలా ?

ఏళ్లు గడిచినా మరమ్మతులకు నోచుకోని కాలువలు

ఓజిలి, మే 19 : రైతులకు సాగు నీరు, చెన్నైకి తాగునీరు అందించే ఉద్దేశంతో రూపుదిద్దుకున్న తెలుగు గంగ కాలువ నేడు చెన్నైకి తాగునీరు ఎలా ఉన్నా నెల్లూరు, తిరుపతి జిల్లాల రైతాంగానికి సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. సోమశిల వద్ద కండలేరు-పూండి(కేపీ కెనాల్) కాలువ పేరుతో ప్రధాన కాలువ ఏర్పాటుచేసి తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోటకు సమీపంలోని పూండి రిజర్వాయరు వరకు గల 406 కిలోమీటర్ల పొడవున ఈ కాలువ ఏర్పాటైంది. ఈక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కేపీ కెనాల్ నుంచి ఏడు బ్రాంచి కాలువల ద్వారా జిల్లా రైతులకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రూపుదిద్దుకున్న బ్రాంచి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించే క్రమంలో ఆయా పరిధిలోని చెరువులకు సాగు నీరు నింపుతున్నారు. ఈక్రమంలోనే ఓజిలి మండలంలో 5వ బ్రాంచి కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందుతోంది.



ఓజిలి వద్ద గంగ బ్రాంచ్ కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

ఐదేళ్లుగా అటకెక్కిన మరమ్మతులు

తెలుగు గంగ బ్రాంచి కాలువల ద్వారా సాగునీరు అందుతున్న క్రమంలో ఆయా బ్రాంచి కాలువలు ఏటా మరమ్మతులకు గురై రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గతంలో గంగ అధికారులు బ్రాంచి కాలువలకు తరచుగా మరమ్మతులు చేపట్టడంతోపాటు జంగిల్ క్లియరెన్సు వంటి పనులతో రైతులకు అండగా నిలిచే పరిస్థితి ఉండేది. గత ఐదేళ్ళ నుంచి బ్రాంచి కాలువలపై దృష్టి సారించని నేపథ్యంలో కాలువలు నిర్వీర్యమైపోయాయి. ఎక్కడ చూసినా బ్రాంచి కాలువలతో పాటు 5వ బ్రాంచి కాలువ కూడా ఇలానే తయారైంది. కాలువలు మొత్తం పిచ్చిచెట్లు, తుప్పలు, ముండ్ల పొదలతో సాగు నీరు పారే పరిస్థితి కనిపించడంలేదు.

రైతులకు తప్పని తిప్పలు...

తెలుగు గంగ ద్వారా రైతులకు సాగు నీరు అందించే క్రమంలో కాలువలలో నీటిని విడుదల చేసినా కాలువలలో పేరుకుపోయిన తుప్పలు, ముండ్లపొదలు, గడ్డి పొదల కారణంగా రైతులకు సాగు నీరు అందటంలేదు. దీంతో గత ఐదేళ్లుగా రైతులకు ఏటా సాగునీటి తిప్పలు తప్పడంలేదు. నీరు పుష్కలంగా ఉండీ చివరికంటా రైతులకు ఆనీరు అందకపోవడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. బ్రాంచి కాలువలలో పేరుకుపోయిన ఈ తుప్పలు, ముండ్ల పొదలు, గడ్డి పొదలను తొలగించి రైతులకు సక్రమంగా సాగునీరు అందేలా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

ఊపందుకున్న ఖరీఫ్ పనులు

- పెళ్లకూరు మండలంలో 2600 ఎకరాల్లో వరి సాగు
- కూలీలకు పెరిగిన డిమాండ్

పెళ్లకూరు, మే 19 : మండలంలోని అనేక గ్రామాల్లో వ్యవసాయ బోర్ల కింద వరి నాట్లు పనులు ఊపందుకున్నాయి. స్వర్ణముఖీనది తీర ప్రాంతాలైన పుల్లూరు, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట, చింతపూడి, నెలబల్లి, పాలచ్చూరు, పెళ్లకూరు, కొత్తూరు, రావులపాడు, చిల్లకూరు, జీలపాటూరు తదితర గ్రామాల రైతులు ఖరీఫ్ పంటల సాగులో బిజీగా ఉన్నారు. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండంతో రైతులంతా ఒకేసారి నాట్లు ప్రారంభించడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. మండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 2600 ఎకరాల్లో వరిసాగు చేపడతారని వ్యవసాయశాఖ అంచనా. మండలంలో ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 1010 రకం ధాన్యాన్ని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎకరంలో నాట్లు వేసేందుకు రూ. 3300 నుంచి రూ. 3500 వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు. గతేడాది రూ. 3000 నుంచి రూ. 3200 వరకు తీసుకునే వారు. ఈ ఏడాది అదనంగా రూ.300 నుంచి రూ.500 వరకు కూలీ పెంచేశారు. దీంతో పెట్టుబడి భారీగా పెరుగుతోంది. ఎకరం భూమిలో పంట చేతికి అందేటప్పటికి రూ. 30వేల నుంచి రూ. 35వేలు రైతులకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. పెరిగిన పెట్టుబడులకు వాతావరణం అనుకూలిస్తేనే పంట చేతికి అందుతుంది. కోతల సమయానికి తుపాన్ల ప్రభావంతో అకాల వర్షాలు పడితే భారీగా నష్టాలు తప్పవు.



చిల్లకూరులో నాట్లు వేస్తున్న కూలీలు

మలుపులు... ప్రమాద పిలుపులు



నాయుడుపేట రోడ్డు వద్ద, మోడల్ స్కూల్ వద్ద, రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదకర మలుపులు

వెంకటగిరి టౌన్, మే 19: రహదారుల వద్ద పలు మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రధాన రహదారుల్లోని మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం రావడం లేదు. మలుపుల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటులో ఆర్అండ్‌బీ అధికారులు విఫలమయ్యారు. టోల్‌గేట్‌లు కట్టించుకునే జాతీయ రహదారుల్లో కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.అదేమార్గంలో పాఠశాల ఉందని సూచించే బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.వెంకటగిరి-నాయుడుపేట మార్గంలో నాలుగు మలుపులున్నాయి. ఈ మలుపుల్లో ఎక్కడ కూడా సూచిక బోర్డులు ఏర్పాటు లేదు. అంతే కాకుండా వెంకటగిరి నుంచి రాపూరు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి కాంపాళెం క్రాస్ వద్ద మలుపు ఉంది. ఇక్కడ కూడా సూచిక బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య



గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

గూడూరు, మే 19: ఆదర్శప్రాయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకుడు శివకుమార్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని మార్కెట్ సెంటర్, శివాలయం సెంటర్ తదితర ప్రాంతాలలో సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం, వ్యవసాయ కార్మికుల కోసం సుందరయ్య అలుపెరుగని పోరాటాలు సాగించారన్నారు. వ్యవసాయ కార్మికసంఘాన్ని ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుపేదల సమస్యలను పరిష్కరించారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో శంకరయ్య, బీవీరమణయ్య, సురేష్, మధు, మణి, బాబు, వెంట్రామిరెడ్డి, ప్రసాద్, చంద్రయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : పుచ్చలపల్లి సుందరయ్య ప్రజలకు అందించినసేవలు చిరస్మరణీయమని సీఐటీయూ నాయకులు శివకవి ముకుంద అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు మహేష్‌బాబు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పద్మమ్మ, మణెమ్మ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, పద్మనాభయ్య, సాంబశివయ్య, రమణయ్య, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా నేత ఆర్.లక్ష్మి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబరమైన జీవితాన్ని గడిపి ఎంతో మందికి ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో భక్తుల సందడి



చెంగాళమ్మ ఆలయ క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు, మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఎన్నికల నేపథ్యంలో మూడు వారాలనుంచి భక్తుల సందడి కనిపించలేదు. ఈ వారం ఉదయం నుంచి ఆలయ ప్రాంగణమంతా ఎక్కడ చూసినా భక్తుల సందడే కనిపించింది. ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. - సూళ్లూరుపేట

పేదలకు కూరగాయల పంపిణీ



గూడూరు అర్బన్, మే 19: స్థానిక సీవీసీ పార్కులో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పేదలకు, దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పేదలకు, దివ్యాంగులకు చేయూతనందించేలా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్, చెంచునారాయణ, జగదీష్, గోపి, విజయ్‌బాబు, సుధీర్, పవన్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు పీడీకి సన్మానం



గూడూరు, మే 19: పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఉద్యోగవిరమణ చేసిన చిల్లకూరు గురుకుల పాఠశాలలోని పీడీ జానకిరామయ్యకు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జానకిరామయ్య ఎంతో అంకితభావంతో విధులు నిర్వహించారన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఈ రోజు తాము సమాజంలో వివిధ రంగాలలో ఉన్నత స్థానాలలో రాణిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు కంటేపల్లి వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, సురేష్, జిలానిబాషా, ధర్మయ్య, పరుశురామ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బలరామ్‌రెడ్డి, ఇబ్రహీమ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కోటమ్మకు పూజలు



కోట, మే 19 : కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి వారు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఏడు పెట్రోల్ బంకులకు నోటీసులు

కోట, మే 19 : కోట మండలంలోని 7 పెట్రోల్ బంకులకు ఆదివారం హెచ్చరిక నోటీసులు జారీచేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. మాచర్లలో జరిగిన ఘటన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పలు కీలక ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో పెట్రోల్ బంకుల యజమానులను అప్రమత్తం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయా పెట్రోల్ బంకుల నుంచి లూజుగా క్యాన్‌లు, సీసాలలో పెట్రోలు పట్టి ఇవ్వకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

దాడి చేశారని ఫిర్యాదు

చిల్లకూరు, మే 19: మండలంలోని గుత్తావారిపాళెంలో ఆదివారం అదే గ్రామానికి చెందిన నారాయణతోపాటు పలువురు కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన సుధాకర్, నెల్లూరుకు చెందిన అనూప్‌రెడ్డిలపై దాడి చేశారని ఆదివారం బాధితుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పొలం విషయమై చర్చించుకుంటుండగా వివాదం ఏర్పడడంతో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రామమందిరానికి వెండి కానుక



నాయుడుపేట, మే 19 : పట్టణంలోని బజారువీధిలో వెలసిన రామమందిరానికి ఓ దాత వెండి కానుకను అందజేశారు. ఆదివారం పట్టణానికి చెందిన దాత హరికృష్ణ, రమ్య, మహదేవరెడ్డిల సహకారంతో 20వేల రూపాయలు విలువచేసే వెండి కానుకను దేవదాయశాఖ ఈవో శశ్యాంక్‌కు అందజేశారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు.

నేడు జలశక్తి కమిటీ రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 19: జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇద్దరు సభ్యుల బృందం పద్మావతి యూనివర్సిటీకి నేడు రానుంది. జాతీయ నీటి పురస్కారం కోసం గత డిసెంబరులో యూనివర్సిటీ దరఖాస్తు చేసుకుంది. దీంతో, యూనివర్సిటీలో నీటి పొదుపు, నిల్వ చేసే విధానం, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత, గ్రీన్ హౌస్, ఔషధ మొక్కల పెంపకం, హాస్టళ్ళలోని వ్యర్థాలతో ఎరువుల తయారీ, ఇంకుడు గుంతల ఏర్పాటు వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ఈ అవార్డుకు దేశంలోని 200 యూనివర్సిటీలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో 20 యూనివర్సిటీలను ఎంపిక చేశారు. మన రాష్ట్రంలో రెండు యూనివర్సిటీలు ఎంపికయ్యాయి. వీటిలో పద్మావతి యూనివర్సిటీ ఒకటి. ఈ క్రమంలో జలశక్తి కమిటీ పద్మావతి వర్సిటీని సందర్శించనుంది. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ భారతితోనూ సమావేశం కానున్నారు. అన్నీ అనుకూలిస్తే, జూన్‌లో యూనివర్సిటీ జాతీయ నీటి పురస్కారానికి ఎంపిక కానుంది.

నేడు ఇంటర్ తత్కాల్‌ఫీజు చెల్లింపునకు చివరిగడువు

తిరుపతి(విద్య), మే 19: ఈనెల 24నుంచి జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల తత్కాల్‌ఫీజు చెల్లింపునకు సోమవారంతో గడువుతేదీ ముగుస్తుందని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సబ్జెక్టులకు సంబంధించిన ఫీజుతోపాటు అదనంగా రూ.3వేలు ఇంటర్‌బోర్డుకు చెల్లించాలని తెలిపారు. వివరాలకోసం 9441433025 నెంబరుని సంప్రదించాలని కోరారు.

జ్ఞానభూమిలో ఇంటర్ హాల్‌టికెట్లు: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు జ్ఞానభూమిలాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని ఆర్ఐవో పేర్కొన్నారు. విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, హాల్‌టికెట్లపై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు


ఎదురెదురుగా ఢీకొన్న వాహనాలు

కంటైనర్ - లారీ ఢీ
డ్రైవర్‌కు తీవ్రగాయాలు


డ్రైవర్ కృష్ణయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

శ్రీకాళహస్తి, మే 19: కంటైనర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ కృష్ణయ్య(45) తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై జరిగింది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు... బెంగళూరు నుంచి కొత్త కార్ల లోడ్‌తో కంటైనర్ ఒడిస్సాకు బయలుదేరింది. నందలూరుకు చెందిన కృష్ణయ్య నాయుడుపేట నుంచి ఖాళీ లారీని నడుపుతూ తిరుపతి వైపు బయలుదేరాడు. రాచగున్నేరి వద్ద రెండు వాహనాలూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఖాళీ లారీ నడుపుతున్న డ్రైవర్ కృష్ణయ్య క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వెలుపలకు తీశారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

పెద్ద కాళహస్తి మహత్యం పుస్తకావిష్కరణ


పెద్ద కాళహస్తి మహత్యం పుస్తకావిష్కరణలో మేడసాని మోహన్

శ్రీకాళహస్తి, మే 19: పెద్ద ధూర్జటి మునిమనవడు ధూర్జటి లింగరాజు కవి రాసిన తాళపత్ర గ్రంథానికి పట్టణానికి చెందిన స్వర్గీయ లగడపాటి భాస్కర్ పరిష్కర్తగా వ్యవహరించి పెద్దకాళహస్తి మహత్యం పుస్తకాన్ని ముద్రించారు. దీనికి పంచ సహస్రావధాని మేడసాని మోహన్ తుదిరూపు దిద్దారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేడసాని మోహన్ మాట్లాడుతూ పెద్దకాళహస్తి మహత్యం సంస్కృత తాళపత్ర గ్రంథాన్ని తెలుగులో పుస్తక రూపంలో తీసుకువచ్చే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతం అన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈవో రామారావు మాట్లాడుతూ ఈ గ్రంథాన్ని పుస్తక రూపంలో తీసుకురావడంలో లగడపాటి భాస్కర్, మేడసాని మోహన్ కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, సింగరాజు ప్రకాశం శాస్త్రి, ఆముదాల మురళి, లగడపాటి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పులివర్తి నానీకి బృందమ్మ పరామర్శ


నానీని పరామర్శిస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, మే 19: వైసీపీ నేతల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ పరామర్శించారు. ఆదివారం పులివర్తి నానీ స్వగృహంలో ఆయనను కలిసి వివరాలు తెలుసుకున్నారు. వైసీపీ దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఆగమోక్తంగా చెన్నకేశవస్వామి ధ్వజారోహణం


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మే 19: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం ఆగమోక్తంగా ధ్వజారోహణం జరిగింది. ముందుగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారెను అందజేశారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభానికి గరుడ పతాకం ధరింప జేసి ఎగురవేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి స్వామి అమ్మవార్లు హంసవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

పుత్తూరు టౌన్, మే 19: మండల పరిధిలోని పరమేశ్వర మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థి సాంబ పాఠశాలకు ఐదు ఫ్యాన్లు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయదేవ్, హేమలత, రోజారాణి, ప్రసన్న, హరిత, మహాలక్ష్మి, సుజాత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

పుత్తూరు టౌన్, మే 16: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానికులకు మజ్జిగ వితరణ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకటేష్, విజయ్, కేఆర్ సుబ్రహ్మణ్యం పిళ్లై, పురుషోత్తం, రమేష్, యాసిన్‌బాషా, కుమార్, శివ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చక్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మే 19: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన చక్రేశ్వర స్వామికి ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


మోసం 'గురూ'..!

- నాగలాపురం - చిన్నపాండూరు రోడ్డు విస్తరణంటూ షో
- ఎన్నికల కోడ్ విడుదలకు ముందు భూమిపూజ
- ప్రచారం ముగియగానే పనులు ఆపేసిన వైనం


అసంపూర్తిగా ఆపేసిన రోడ్డు పనులు

సత్యవేడు, మే 19: సత్యవేడు ప్రజల చెవిలో తిరుపతి ఎంపీ గురుమూర్తి పువ్వు పెట్టారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు రోడ్డుకోసం భూమిపూజ చేసి, పనులు చేపట్టకుండానే ఎంపీ తమకు షో చూపించారని నాగలాపురం మండల ప్రజలు మండి పడుతున్నారు. నాగలాపురం - చిన్నపాండూరు రోడ్డు విస్తరణ కోసం 2021లో వైసీపీ ప్రభుత్వం రూ.30కోట్లు మంజూరు చేసింది. మంత్రి పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ కంపెనీ ఈ పనులు దక్కించుకోగా, సాక్షాత్తు మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేసి, ఆర్భాటంగా శిలాఫలకాన్ని ప్రారంభించారు. అయితే మూడేళ్లుగా పనులు చేపట్టకుండా కాలయాపన చేశారు. దీంతో 25 గ్రామాల ప్రజలు గుంతల రోడ్లలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఈ పనులు చేపట్టి ప్రజల అవస్థలు తీర్చాలని అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ అభ్యర్థి ఆదిమూలం పలుమార్లు సీఎం జగన్ దగ్గర మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఏడాది క్రితం నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు ఆ గుంతల రోడ్డుకు తమ స్వంత నిధులతో గ్రావెల్ తోలి చదును చేశారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో జరిగిన రాజకీయ పరిణామాలతో ఎమ్మెల్యే ఆదిమూలం టీడీపీలోకి రావడం, వైసీపీ అభ్యర్థిగా నూకతోటి రాజేష్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓట్లు అడిగేందుకు గ్రామాల్లోకి వెళితే ప్రజలు ఎదురు తిరుగుతారని గ్రహించిన ఎంపీ గురుమూర్తి రోడ్డు మరమ్మతులకు తన స్వంత నిధుల నుంచి రూ.1.50 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. సరిగ్గా ఎన్నికల కోడ్ విడుదలకు నాలుగు రోజుల ముందు ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ ఇద్దరు కలిసి రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించారు. గతుకుల రోడ్డుకు రెండు చోట్ల అతుకులు వేసి, ఇక పనులు పూర్తి చేసేస్తామని ప్రజలను నమ్మబలికి ఆయా గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించుకున్నారు. ప్రచారం పూర్తయిన వెంటనే పనులు ఆపేసి, ప్రజల చెవుల్లో పువ్వు పెట్టారు. ఇప్పటికైనా రోడ్డుకు కనీసం మరమ్మతులైనా చేపట్టి తమ అవస్థలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

రాజీవ్‌నగర్‌ను జల్లెడ పట్టిన పోలీసులు


కార్డన్‌సెర్చ్ కోసం సిబ్బందిని సమాయత్తం చేస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి

శ్రీకాళహస్తి, మే 19: శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌కాలనీలో పోలీసులు ఆకస్మిక సోదాలు చేసి జల్లెడ పట్టారు. ఆదివారం వేకువజామున పెద్దఎత్తున పోలీసులు రాజీవ్‌నగర్‌లో మొహరించి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పట్టణంలోని 35వార్డులకు చెందిన పలువురు రాజీవ్‌నగర్ కాలనీలో నివాస గృహాలను ఏర్పరచుకున్నారు. ఇటీవల కొద్ది సంవత్సరాల నుంచి ఇతర ప్రాంతాలకు చెందిన వారు, పలువురు గుర్తు తెలియని వ్యక్తులు పెద్దఎత్తున అక్కడ నివాసాలు ఏర్పరచుకున్నారు. రాజీవ్‌నగర్‌కాలనీ వేదికగా అసాంఘిక కార్యకలాపాలు ఇటీవల కొన్ని వెలుగు చూశాయి. దీంతో పోలీసుశాఖ ఉన్నతాధికారులు రాజీవ్‌నగర్‌లో ఆకస్మిక సోదాలు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఆదివారం ఉదయం 3గంటల సమయంలో శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, అధికారులు, సిబ్బంది మొత్తాన్ని అప్రమత్తం చేశారు. మొదట మొత్తం అందరూ 1వ పోలీస్‌స్టేషన్ వద్ద సమావేశమయ్యారు. ఎక్కడా కార్డన్‌సెర్చ్ నిర్వహించబోతున్నారనే విషయం కూడా అప్పటి వరకు గోప్యంగా ఉంచారు. చివరి నిమిషంలో రాజీవ్‌నగర్ ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించనున్నట్లు వెల్లడించి భారీ ఎత్తున పోలీసు యంత్రాంగం ఒకే సారి అక్కడికి చేరుకున్నారు. ఆ ప్రాంతం మొత్తాన్ని మొహరించి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. రెండు ద్విచక్ర వాహనాలు అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి రాజీవ్‌నగర్‌లో నివాసం ఏర్పరుచుకున్న పలువురు వ్యక్తుల వివరాలను నమోదు చేసుకుని ఆరా తీశారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయం వద్ద భక్తులు

శ్రీకాళహస్తి, మే 19: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి, వారాంతపు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 32వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 ప్రత్యేక దర్శన టిక్కెట్ల ద్వారా 1,424, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,645 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,962 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,120మంది, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 288మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 258, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 57మంది భక్తులు రాహుకేతు పూజలు చేసుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 19,190 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

దళితుల మధ్య చిచ్చుపెట్టడం పెద్దిరెడ్డికి తగదు


ఏఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న సర్పంచు మురుగేశం, యువకులు

నారాయణవనం, మే 19: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కులాల పేరుతో రెచ్చగొట్టి, తగాదాలు పెట్టడం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తగదని భీముని చెరువు దళితవాడకు చెందిన సర్పంచు మురుగేశం అన్నారు. ఆదివారం ఆయన గ్రామ యువకులతో కలిసి మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సొరకాయలు, మరికొంత మంది వైసీపీ నాయకులపై ఏఎస్ఐ ఆశీర్వాదంకు ఫిర్యాదులో చేశారు. ఈ సందర్భంగా మురుగేశం, భీముని చెరువు యువకులు మాట్లాడుతూ తమ గ్రామంలో 40 ఏళ్లుగా ఎన్నికలకు సంబంధించి ఒక కట్టుబాటు పెట్టుకున్నామని తెలిపారు. తమకు నిస్వార్థంగా సేవలందించే వారికే ఓటు వేయాలని నిశ్చయించుకుని ప్రతి ఎన్నికల సందర్భంగా తీర్మానం చేసుకుంటామని చెప్పారు. ఈసారి ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆదిమూలంను స్థానికుడుగా గుర్తించి, ఆయనకే ఓటు వేయాలని గ్రామస్తులందరూ తీర్మానించినట్లు వెల్లడించారు. అయితే మంత్రి పెద్దిరెడ్డి స్థానిక వైసీపీ నాయకులతో కలిసి తమ గ్రామంలో దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ఎటువంటి పరిణామాలు జరిగినా మంత్రి పెద్దిరెడ్డితో పాటు స్థానిక వైసీపీ నాయకులనే బాధ్యులుగా గుర్తించాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు ఆర్ముగం, గ్రామస్తులు నాగయ్య, కన్నెప్ప, రమేష్, మురళి, గోవిందరాజులు, చీరాలయ్య, శివలింగం, హరిబాబు, సతీష్, అరుణ, ఢిల్లీబాబు, సుందరరాజులు, గోపీ, సందీప్, సుధాకర్, ఆర్ముగం, మణికండన్, తనికాచలం, జోసఫ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్నకొట్టాయి ఉత్సవం


ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, మే 19: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణంలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, గంధం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రమణీయంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.5 లక్షల విరాళం

పిచ్చాటూరు, మే 19: కాణిపాకం వినాయకుడి ఆలయంలో నిత్య అన్నదాన పథకానికి పిచ్చాటూరుకు చెందిన శ్రీమంజు ట్రేడర్స్ అధినేత మునిశేఖర్‌నాయుడు దంపతులు రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డిని కలిసి చెక్కు అందించారు. వేద పండితులు దాతను ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆరోగ్యం సరిగాలేకున్నా
బందోబస్తు డ్యూటీయా?
ఏఎస్ఐ భార్య వేదన


సుబ్బయ్యకండ్రిగలో బందోబస్తు డ్యూటీలో వున్న భర్తతో సరస్వతి

రేణిగుంట, మే 19: ఆరోగ్యం సరిగ్గా లేని తన భర్తకు బందోబస్తు డ్యూటీ ఎలా వేస్తారని ఓ ఏఎస్ఐ భార్య ప్రశ్నించారు.ఆయనతో కలిసి బందోబస్తు డ్యూటీ రాత్రంతా చేసి నిరసన వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా రేణిగుంట అర్బన్ స్టేషన్లో ఏఎస్ఐగా శేఖర్‌రాజు పని చేస్తున్నారు. శనివారం రాత్రి ఆయన భార్య సరస్వతి మీడియాతో మాట్లాడుతూ బీపీ, షుగర్‌తో బాధపడుతున్న తన భర్తకు ఇటీవల బంధువుల పెళ్లికి సెలవు అడిగినా ఇవ్వలేదని ఆరోపించారు. రేణిగుంట మండలం సుబ్బయ్యకండ్రిగ గ్రామంలో రాత్రి 10గంటల నుంచి విధులు నిర్వహించి తిరిగి తెల్లవారుజామున 5గంటలకు శ్రీకాళహస్తి డీఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని మెసేజి పంపించారని, కళ్లు సరిగ్గా కనపడని తన భర్తకు జరగరానిది జరిగితే తమకు దిక్కు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో పాటు తానూ రాత్రంతా వున్నానన్నారు. స్టేషన్లో 50మంది సిబ్బంది ఉన్నా 61 సంవత్సరాల తన భర్తకు బందోబస్తు డ్యూటీలు వేయడంపై మండిపడ్డారు.

వడ్డికండ్రిగలో ఎల్లమ్మ కొలుపు

కేవీబీపురం, మే 19: మండలంలోని వడ్డికండ్రిగ గ్రామంలో వెలసిన గ్రామదేవత ఎల్లమ్మతల్లికి ఆదివారం గ్రామస్తులు కొలుపు ప్రారంభించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గ్రామవీధుల్లో ఊరేగిస్తూ భక్తులు అగ్నిగుండం తొక్కారు. ఆలయంలో వేసిన ఎల్లమ్మ ముగ్గు ఆకట్టుకుంది.

కొవ్వొత్తుల ర్యాలీ

శ్రీకాళహస్తి, మే 19: పట్టణంలోని నగరివీధిలో గల స్టెప్స్ సంస్థ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించారు. డాక్టర్ ప్రమీలమ్మ మాట్లాడుతూ ఎయిడ్స్ మృతుల ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. నగరివీధిలో సంస్థ సిబ్బంది, ప్రజలు మౌనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది భాస్కర్, సురేష్, రోజా, కళావతి, సునీత తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమాలకు శ్రీకారం


సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి, మే 19: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఆదివారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, రెడ్డిపల్లి సురేష్, బాలకృష్ణ, గెడి వేణు, అన్వర్ బాషా, కుమార్, వెంకటేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: మండలంలోని పేరడం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, విప్లవ వందనాలు అర్పించారు. అనంతరం ఎర్రజెండాను ఎగురవేశారు. సీపీఎం ఇన్‌చార్జి దాసరి జనార్దన్, మండల కార్యదర్శి రమేష్, కార్యకర్తలు మునస్వామి, క్రిష్టయ్య, సెల్వం, అముల్, రోస్లిన్, సుశీల, చంద్రయ్య, రవి, వెంకటేశులు, మగి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగయ్య, రాంబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో పుచ్చలపల్లి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల్పించారు. సీపీఎం సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి దాసరి జనార్దన్, నాయకులు రమణయ్య, తిరుపాల్, సుబ్బయ్య, జేకే రమణయ్య, క్రిష్టమ్మ, శంకరమ్మ, సుజాత పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని కస్తూరిపురం గిరిజనకాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరాజు, కన్నెమ్మ, మరియమ్మ, వరలక్ష్మి, జ్ఞానయ్య తదితరులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మకు పొంగళ్లు


పొంగళ్లు తీసుకెళుతున్న మహిళలు

వరదయ్యపాళెం, మే 19: వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీ వడ్డిపాళెంలో ఆదివారం పేరంటాలమ్మకు పొంగళ్లు పెట్టారు. మహిళలు పెద్దసంఖ్యలో ఆలయం వద్దకు ఊరేగింపుగా చేరుకుని పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏర్పేడు, మే 19: పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను, పాఠశాల సిబ్బందిని సన్మానించారు.